VEGA JEWELLERS
దివిలోనైనా... భువిలోనైనా.. వేగ తోడుంటే
వివాహం వైభోగం అవుతుంది.
ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | USA
follow us vegajewellers

RNI NO : APTEL/2016/69464

# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 5

పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

ఆదివారం 31 మే 2026

## ప్రతిష్టాత్మకంగా జూన్ 21న యోగాంధ్ర@2026

- జూన్ 7 నుంచి 14 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా యోగాంధ్ర
- రాజధాని అమరావతిలో 25 వేల మందితో రాష్ట్ర స్థాయి కార్యక్రమం
- వెయ్యి మందితో జిల్లా కేంద్రాల్లో యోగా ఈవెంట్స్
- రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు కోటి మంది పాల్గొనేలా కార్యాచరణ
- యోగాంధ్ర 2026 పై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

**అమరావతి, కలంకౌంటర్ :** రాష్ట్రంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా, ఘనంగా యోగాంధ్ర-2026 నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. జూన్ 21వ తేదీ అంతర్జాతీయ యోగా డే నిర్వహణకు సంబంధించి మంత్రులు, అధికారులతో సీఎం సమీక్ష చేశారు. ఈ సందర్భంగా యోగాంధ్ర 2026పై తలపెట్టిన కార్యక్రమాలపై అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. యోగాంధ్ర - 2026 కార్యక్రమంలో భాగంగా జూన్ 7 నుంచి 14 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రాజధాని అమరావతిలో 25 వేల మందితో నిర్వహించే రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొంటారు. రాజధాని ప్రాంతంలోని కృష్ణా నదీ వంతెనపై యోగా కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. వెస్ట్ బైపాస్ రోడ్ నిర్మాణంలో భాగంగా నదిపై నిర్మించిన బ్రిడ్జిపై కార్యక్రమం ఇంటర్నేషనల్ యోగా డే జూన్ 21న నిర్వహిస్తారు. అలాగే అదే రోజు జిల్లా కేంద్రాల్లో 1000 మందితో నిర్వహించే కార్యక్రమాల్లో మంత్రులు, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొంటారు. యోగాంధ్ర కార్యక్రమాన్ని అన్ని ప్రాంతాల్లో, అన్ని స్థాయిల్లో, అన్ని విభాగాల్లో నిర్వహించాలని సీఎం సూచించారు. మొత్తంగా కలిపి కోటి మంది భాగస్వాములు అయ్యేలా కార్యాచరణ సిద్ధం చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న 1.50 లక్షల మంది ట్రైనర్లకు అందనంగా మరో లక్ష మందిని ట్రైనర్లుగా చేసేందుకు అవసరమైన శిక్షణ ఇస్తారు. ఒక జిల్లా ఒక థీమ్ తో 14 రోజుల యోగాంధ్ర నిర్వహిస్తారు. జిల్లాల్లో యోగాంధ్ర నిర్వహణకు జిల్లాకు రూ.25 లక్షల చొప్పున నిధులు కేటాయించారు.



**అన్ని శాఖల సమన్వయం... కోటి మంది భాగస్వామ్యం..** ఆరోగ్య, మానవవనరులు, మునిసిపల్, పంచాయతీ రాజ్, దేవాదాయ, ఐటీ శాఖల సమన్వయంతో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించనున్నారు. ప్రతి జిల్లాలోని రెండు ప్రముఖ టూరిస్టు ప్రాంతాల్లో అంటే 56 టూరిస్టు కేంద్రాల్లో ప్రత్యేక సెషన్స్ నిర్వహిస్తారు. ఒక రోజు రెండు జిల్లాల చొప్పున 500 మందితో టూరిస్టు ప్రాంతాల్లో యోగా నిర్వహిస్తారు. అలాగే 14 రోజుల పాటు పార్కులు, విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, స్వర్ణ వార్డు, స్వర్ణ గ్రామం కార్యాలయాల్లో యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తారు. యోగాంధ్ర ఈవెంట్స్ కు గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి వరకు అవార్డులు చేస్తారు.

**యోగాపై మంతెన సత్యనారాయణ రాజు ప్రత్యేక వీడియోలు..** రాష్ట్ర ప్రభుత్వ యోగా, నాచురోపతి విభాగ సలహాదారు మంతెన సత్యనారాయణ రాజు యోగాంధ్ర నిర్వహణకు సంబంధించి రూపొందించిన పోస్టర్ ను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించారు. యోగాపై అవగాహనకు, శిక్షణకు తాను చేపట్టిన కార్యక్రమాలను సత్యనారాయణ రాజు సీఎంకు వివరించారు. 90 ఆసనాల వీడియోలు, 21 ఆరోగ్య సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ఆసనాలు వీడియోలు, రోజు వారీ సాధన కోసం యోగాసనాలు, ప్రాణాయామంపై 7 వీడియోలు, యోగా సందేహాలు ప్రశ్నలు-సమాధానాలపై చేసిన వీడియోలను పబ్లిక్ డొమైనులో పెట్టనున్నట్లు తెలిపారు. మీడియా, సోషల్ మీడియా, వివిధ డిజిటల్ ప్లాట్ ఫామ్స్ ద్వారా వీటిని ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు కార్యాచరణ చేపట్టినట్లు తెలిపారు. 8142404888 నెంబర్ కు హాయ్ అని మెసేజ్ పంపడం, క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా ఈ వీడియోలను డౌన్ లోడ్ చేసుకోవచ్చని సత్యనారాయణ రాజు వివరించారు. సమీక్షలో మంత్రులు నారాయణ, సత్యకుమార్, ఆనం రామనారాయణ రెడ్డి, కందుల దుర్గేష్ తో పాటు సీఎస్ సాయి ప్రసాద్, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్, కమిషనర్ వీర పాండియన్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డులు లేని రాష్ట్రంగా ఏపీ రూపుదిద్దుకోవాలి

- ఇండోర్ నగరంలో చెత్త సేకరణ ఆదర్శం
- పల్నాడు జిల్లా, కొండవీడులోని జిందాల్ వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంటు సందర్శించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



**పల్నాడు,కలంకౌంటర్ :** 'చెత్త నుంచి సంపద సృష్టించే మార్గాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. చెత్త ద్వారా విద్యుత్తు తయారీ అనేది ఇంధన మార్గాలకు ప్రత్యమ్నాయంగా, పర్యావరణ పరిరక్షణకు ఎంతగానో తోడ్పడుతుంది. ఒక క్రమపద్ధతిలో చెత్తను సేకరిస్తే, దాని వినియోగం ద్వారా అద్భుతాలు చేయవచ్చ'ని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. పల్నాడు జిల్లా కొండవీడులోని జిందాల్ వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంటును శనివారం పవన్ కళ్యాణ్ సందర్శించారు. చెత్త నుంచి విద్యుత్తు తయారీ ప్రక్రియను ఆసాంతం పరిశీలించి, వివరాలను తెలుసుకున్నారు. చెత్తను ఎలా వేరు చేస్తారు.. దాన్ని ప్లాంట్లో ఎలా శుద్ధి చేస్తారు..? దేనికి ఉపయోగిస్తారనే విషయాలను ప్లాంటు అధికారులు వివరించారు. మ-ఖ్యంగా చెత్తను బాయిలర్లలో మండించడం ద్వారా విద్యుత్తు తయారీ ఎలా జరుగుతుందో, చివరికి బూడిదను ఇటుకల తయారీకి ఎలా వినియోగించుకోవచ్చో అధికారులు క్షుణ్నంగా శ్రీ పవన్ కళ్యాణ్ గారికి తెలిపారు. ఈ సందర్భంగా ప్లాంటు పరిశీలన తర్వాత పూర్తి వివరాలను, ఆంధ్రప్రదేశ్ కు చెత్త సేకరణ విషయంలో ఉన్న అవకాశాలను జిందాల్ వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంటు ఆపరేషన్స్ హెడ్ ఎం.వి.చారి- పవన్ కళ్యాణ్ కి వివరించారు. ఆయన దీనిపై ప్రత్యేకంగా ఓ నివేదిక తయారు చేశానని చెప్పడంతో పూర్తి ప్రజెంటేషన్ ఇచ్చేలా ప్రత్యేక సమయాన్ని పవన్ కళ్యాణ్ కేటాయించారు. ఈ సందర్భంగా ప్లాంటు మొత్తం తిరుగుతూ కీలక అంశాలపై పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "రాష్ట్రంలో రోజువారీగా 7,200 టన్నుల పొడి చెత్త ఉత్పత్తి అవుతోంది. కొండవీడు జిందాల్ ప్లాంటు సామర్థ్యం రోజువారీ 1,400 టన్నుల పొడి చెత్తను ప్రాసెస్ చేసి, సగటున 20 మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేయగలదు. దాన్ని రాష్ట్ర విద్యుత్ గ్రిడ్ తో అనుసంధానం చేసి, రాష్ట్ర ఇంధన అవసరాలు తీర్చగలదు. విశాఖపట్నంలోనూ జిందాల్ ప్లాంటు ఉత్తరాంధ్ర రీజియన్ చెత్తను సేకరించి 15 మెగావాట్లు విద్యుత్తు ఉత్పాదన చేస్తోంది. ఈ తరహా ప్లాంట్లు రాష్ట్రంలో త్వరలో మరో 6 ప్లాంట్లను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. దీనిలో కాకినాడలో ఇప్పటికే పనులు మొదలు కాగా, నెల్లూరు, కడప కర్నూలు, విజయవాడ, తిరుపతి ప్రాంతాల్లో కూడా త్వరలో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సుముఖంగా ఉంది. బయో మిథలైజేషన్ ప్లాంట్ల నుంచి బయో గ్యాస్ కూడా ఉత్తత్తి చేయవచ్చు.

## మహానాడు ఘనవిజయం... సీఎం చంద్రబాబు నాయకత్వానికి చారిత్రక గుర్తింపు

- తెలుగుదేశం శక్తిని చాటిన మహానాడు
- చంద్రబాబు విజన్‌కు కార్యకర్తలు జైకొట్టారు
- లోకేష్ నాయకత్వం... యువతలో కొత్త ఉత్సాహం
- అభివృద్ధి, సంక్షేమానికి కార్యాచరణ పథంగా మహానాడు
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు మంత్రుల అభినందనలు



**అమరావతి, కలంకౌంటర్ :** తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మక వార్షిక మహాసభ "మహానాడు -- 2026" అపూర్వ విజయవంతం కావడంతో రాష్ట్ర ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుకు రాష్ట్ర మంత్రివర్గ సభ్యులు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ, మహానాడు కేవలం ఒక రాజకీయ కార్యక్రమం మాత్రమే కాకుండా, రాష్ట్ర భవిష్యత్‌కు దిశానిర్దేశం చేసిన చారిత్రక వేదికగా నిలిచిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన దూరదృష్టి, పరిపాలనా అనుభవం, అభివృద్ధి సంకల్పంతో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దే దిశగా ముందుకు తీసుకెళు న్నారని కొనియాడారు. ప్రజా సంక్షేమం, పారదర్శక పాలన, సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, పెట్టుబడుల ఆకర్షణ, యువతకు ఉపాధి అవకాశాల కల్పన వంటి అంశాల్లో చంద్రబాబు నాయుడు చూపిస్తున్న నాయకత్వం రాష్ట్రానికి కొత్త ఆశలను కల్పిస్తోందని పేర్కొన్నారు. మహానాడులో ప్రతిధ్వనించిన తీర్మానాలు, చర్చలు, భవిష్యత్ కార్యాచరణ పార్టీ ప్రజల పట్ల ఉన్న నిబద్ధతకు అద్దం పట్టాయని అన్నారు. పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ యువశక్తిని సంఘటితం చేస్తూ, ఆధునిక రాజకీయాలకు కొత్త నిర్వచనం ఇస్తున్నారని మంత్రులు ప్రశంసించారు. పార్టీ బలోపేతం, యువత

- 2లో

## జూన్ ఎన్టీఆర్ భరోసా పెన్షన్లకు 2728 కోట్లు విడుదల

**అమరావతి,కలంకౌంటర్ :** రాష్ట్ర వ్యాప్తంగా జూన్ నెలలో 62,34,445 మంది పెన్షన్ దారులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లకు కూటమి ప్రభుత్వం రు.2728.67 కోట్లు విడుదల చేసినట్టు రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొత్తగా 5606 స్పౌజ్ ( భార్య / భర్త ) పెన్షన్లు మంజూరు కాగా... ఈ లబ్ధిదారులకు రు 2.24 కోట్లను ప్రభుత్వం ప్రత్యేకంగా విడుదల చేసినట్లు మంత్రి తెలిపారు. ఈ నిధులు అన్నీ జూన్ 1వ తేదీ సోమవారం ఉదయం నుంచే లబ్ధిదారులకు నేరుగా పంపిణీ చేస్తామని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి జూన్ నెలతో కలుపుకుని ఇప్పటి వరకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల కోసం రికార్డు స్థాయిలో రూ. 65,886.57 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. అవ్వాతాతలు, నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ నిధులను ప్రతి నెలా 1వ తేదీనే లబ్ధిదారులకు అందిస్తోందని మంత్రి కొండపల్లి తెలిపారు.




## ఆర్టీసీ ఆధునీకరణకు కీలక నిర్ణయాలు

-రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

- భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు విశాఖపట్నం నుంచి 40 ప్రత్యేక బస్సులు
- గత ఐదేళ్లలో దెబ్బతిన్న ఆర్టీసీని కూటమి ప్రభుత్వం గాడిలో పెట్టింది...మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



**అమరావతి, కలంకౌంటర్ :** ముఖ్యమంత్రి అధ్యక్షతన నిర్వహించిన ఏపీఎస్ఆర్టీసీ ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో బస్సుల ఆధునీకరణ, ఈవీ బస్సుల విస్తరణ, ఉద్యోగుల సంక్షేమం తదితర అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. గత ఐదేళ్లలో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్న ఆర్టీసీని కూటమి ప్రభుత్వం గాడిలో పెట్టిందని మంత్రి పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్న స్త్రీ శక్తి పథకం విజయవంతంగా ఏడాది పూర్తి చేసుకుని కొనసాగుతోందని తెలిపారు. రాష్ట్రంలో దశలవారీగా ఈవీ బస్సుల విస్తరణకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసిందని, తొలి దశలో 700 ఈవీ బస్సులు రెండు నెలల్లో అందుబాటులోకి రానున్నాయని వెల్లడించారు. జూలై నెలలో ఆరు డిపోలలో ఈవీ బస్సుల నిర్వహణకు అవసరమైన మౌలిక సదు-పాయాలు సిద్ధం కానున్నాయని తెలిపారు. తిరుపతికి ప్రత్యేకంగా 300 ఈవీ బస్సులు కేటాయించగా, మరో 500 ఈవీ బస్సుల కొనుగోలు ప్రక్రియ పూర్తయిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 3,000 ఈవీ బస్సుల ఏర్పాటుకు ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుని ముందుకు సాగుతోందని చెప్పారు. విశాఖపట్నం నుంచి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి 40 ప్రత్యేక బస్సులను కేటాయించనున్నట్లు తెలిపారు. అలాగే గోదావరి పుష్కరాల సందర్భంగా గోదావరి పేరున ప్రత్యేక బస్సు సర్వీసులను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆర్టీసీని ప్రైవేటీకరించే ఆలోచన ప్రభుత్వానికి లేదని, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య ఆర్టీసీ అవినాభావ అనుబంధమని పేర్కొన్నారు. పీపీపీ విధానంలో డిపోల ఆధునీకరణ చేపడతామని, కార్మికులకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలోనే నైట్ ఔట్ అలవెన్స్ సహా ఉద్యోగుల పలు సమస్యలను పరిష్కరించినట్లు మంత్రి గుర్తుచేశారు. త్వరలో అందుబాటులోకి రానున్న కొత్త ఈవీ బస్సులతో ఏపీఎస్ఆర్టీసీకి మరింత కొత్త రూపు సంతరించుకుంటుందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు.

## కూచిపూడి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు



**కూచిపూడి( కృష్ణా జిల్లా),కలంకౌంటర్ :** ఆర్యవైశ్య జాతిని, మాజీ మంత్రి దానశీలి టి. జి. వెంకటేష్ ని కించపరుస్తూ సోషల్ మీడియాలో అభ్యంతర కరమైన వ్యాఖ్యలు చేసిన పంచ్ ప్రభాకర్ పై చర్యలు తీసుకోవాలని కోరుతూ కూచిపూడి పోలీస్ స్టేషన్ లో మొవ్వ మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతు దేశంకోసం తెలుగు రాష్ట్రం కోసం ప్రాణాలు త్యాగం చేసిన మహనీయులు పుట్టిన జాతి , సమాజం లో శాంతి కోసం ప్రాణ త్యాగం చేసిన వాసవీ అమ్మవారి చరిత్ర తెలుసుకోవాలని సూచించారు, అన్ని వర్గాల వారిని అభిమానిస్తూ సేవ దృక్పథం, సమాజ శ్రేయస్సు కృషి చేసే ఆర్యవైశ్యులని కించపరిస్తే సహించేది లేదని ఆర్యవైశ్యులు స్పష్టం చేశారు. పంచ్ ప్రభాకర్ పై చర్యలు తీసుకోవాలని కూచిపూడి ఎస్ ఐ సురేష్ ని కోరారు., ఈ కార్యక్రమం లో కృష్ణాజిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం ప్రధాన కార్యదర్శి మానేపల్లి సత్యశాయి, జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రాంతీయ కార్యదర్శి వలివేటి దుర్గా నాగేశ్వరరావు, కూచిపూడి ఆర్యవైశ్య ప్రముఖులు కటకం పూర్ణచంద్రరావు, మండల ఆర్య వైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి పువ్వాడ సురేష్, , గార్లపాటి వెంకటేశ్వర రావు, నందిపాటి వసంతం, మాటూరి వెంకటేశ్వర రావు, బెజవాడ సాంబ శివ రావు (శివ), కోట భాస్కరరావు, కోన రంగారావు, నందిపాటి రామచంద్రరావు, పల్లంపాటి సత్యనారాయణ, కోట పవన్ కుమార్, కరుమూరి లక్షాధికారి, యెండూరి జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

## సూయజ్ శానిటేషన్ వాటర్ ప్లాంట్ యూనిట్ పరిశీలించిన ప్రభుత్వ చీఫ్ విప్





**వినుకొండ,కలంకౌంటర్ :** వినుకొండ పట్టణంలోని నరసరావుపేట రోడ్డులో సూయజ్ శానిటేషన్ వాటర్ ప్లాంట్ నిర్మాణ పనులను ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు పరిశీలించారు.ప్లాంట్ నిర్మాణ నాణ్యతను పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. చీఫ్ విప్ జీవీ మాట్లాడుతూ.. పట్టణ ప్రజల ఆరోగ్య సంరక్షణలో భాగంగా మురుగునీటి శుద్ధి ఎంతో కీలకమని, ఈ ప్రాజెక్టును నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో ఎక్కడా రాజీ పడకుండా, ఆధునిక సాంకేతికతతో ప్లాంట్‌ను సిద్ధం చేయాలని సూచించారు.డీసీసీబీ చైర్మన్ లిమక్కెన మల్లికార్జున రావు , జనసేన నాయకులు నిస్సంకర శ్రీనివాసరావు, నాయకులు,అధికారులు పాల్గొన్నారు.

## మెగా డీఎస్సీపై ఆరోపణలు అవాస్తవం

- మంచి చేస్తే ఓర్చుకోలేని స్థితి జగన్ నైజం
- బెజవాడ ప్రసాద్, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి




**కందుకూరు,కలంకౌంటర్ :** సైకో మనస్తత్వం కలిగిన గొడ్డలి పార్టీ అధినేత జగన్ రెడ్డి అసలు మంచి చేయడు, ఎవరైనా మంచి చేసినా ఓర్చుకోలేడని, దానిలో భాగం గానే కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన మెగా డీఎస్సీ పై అసత్య ఆరోపణలు చేస్తున్నాడని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్ విమర్శించారు.తాను సచివాలయ ఉద్యోగాలు అమ్ముకున్నట్లే అందరూ ఉద్యోగాలు అమ్ముకుంటారని జగన్ అనుకోవడం అతని అవివేకానికి నిదర్శనమని, కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యా మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో జరిగిన నియామకాల్లో అవినీతికి తావే లేదనీ, తన హయంలో ఒక్క డీఎస్సీ కూడా వెయ్యకుండా నిరుద్యోగులను మోసం చేసిన చరిత్ర జగన్దేనిని జగన్ తీరుపై తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు, ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ ఏటా జాబ్ క్యాలెండర్ అని చెప్పి ఒక్క ఏడాది కూడా జాబ్ క్యాలెండర్ వెయ్యని మోసకారి జగన్ రెడ్డేనని, తన ఐదేళ్ల పాలనలో ఇటు నోటిఫికేషన్లు వేయక, అటు కంపెనీలను తరిమికొట్టి నిరుద్యోగులను నిలువునా ముంచేసిన దుర్మార్గుడని, కూటమి ప్రభుత్వంలో మెగా డీఎస్సీ లో 16వేల ఉద్యోగాల భర్తీ, జాబ్ క్యాలెండర్ వేయడం జీర్ణించుకోలేక తప్పుడు ఆరోపణలతో నిరుద్యోగుల్లో అపోహలు సృష్టించడానికి ప్రయత్నిస్తున్నాడనీ, రాత్రి, పగలు కష్టపడి చదివి ఉద్యోగం సాధించిన 16 వేల మంది కష్టాన్ని అవమానిస్తున్నారని, టెన్త్ పేపర్లు కొట్టేసి పాసైన ఘన చరిత్ర, బీసీ నాయకుడు శివకుమార్ పెట్టిన పార్టీని కొట్టేసిన చరిత్ర గొడ్డలి పార్టీ అధినేత జగన్ రెడ్డిది అని, అందరూ తనలాంటి వారే అనుకోవడం అతని నైజం అని, జగన్ ఎంత ఏడ్చినా కూటమి ప్రభుత్వం మరలా డీఎస్సీ వేయడం, జాబ్ క్యాలెండర్ అమలు చేయడం, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వడం గ్యారంటీ తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్ అన్నారు.



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం టీడీపీ కేంద్ర కార్యాలయానికి వెళ్లారు. సమస్యలపై వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వైద్యం చేయించుకుని ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పలువురికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి సాయం అందించారు. కార్యకర్తలను పలకరించి వారితో ఫోటోలు దిగారు. అనంతరం పార్టీ నేతలతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశమయ్యారు.
-మంగళగిరి,కలంకౌంటర్ :

# విద్యతోనే అత్యుత్తమ స్థానాలు - రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

- పేదల విద్యకు కుల సంఘాలు బాసటగా నిలవడం అభినందనీయం
- కూటమి రాకతో ప్రభుత్వ విద్యకు మహర్దశ
- ప్రభుత్వ విద్యా సంస్థల్లో విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యం
- సోషల్ మీడియాకు విద్యార్థులు దూరంగా ఉండాలి
- ఎస్ఆర్ఆర్ ట్రస్ట్ ద్వారా పేదల విద్యకు అండగా ఉంటున్నా : మంత్రి సవిత
- 104 మంది విద్యార్థులకు భక్త కనకదాస పురస్కారాలు
- కురమ సంఘ సౌజన్యంతో పురస్కారాలు అందజేసిన మంత్రి సవిత
- సొంత నిధులతో విద్యార్థులకు మంత్రి సవిత ప్రోత్సాహకాలు
- నలుగురికి రూ.25 వేల చొప్పున రూ.లక్ష...
- 200 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగులు అందజేసిన మంత్రి సవిత





**గుంటూరు,కలంకౌంటర్ :** విద్యతోనే అత్యున్నత స్థానాలు సాధ్యమని, తల్లిదండ్రులు తమ బిడ్డలను ఉన్నత విద్య అభ్యసించేలా ప్రోత్సహించాలని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. కూటమి ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యమిస్తోందని, ఇటీవల విడుదలైన టెన్త్, ఇంటర్ ఫలితాలే దీనికి నిదర్శమని అన్నారు. తన తండ్రి పేరు మీద ఏర్పాటు చేసిన ట్రస్ట్ ద్వారా పేద విద్యార్థులకు అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. గుంటూరు నగరంలోని దేవరసాయి కృష్ణ కల్యాణ మండపంలో టెన్త్, ఇంటర్ లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన 104 మంది కురుబ, కురుమ, కురవ సామాజిక వర్గీయ విద్యార్థులకు ఉమ్మడి గుంటూరు కురమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భక్త కనకదాస పేరుతో ఏర్పాటు చేసిన ప్రతిభ పురస్కారాలు మంత్రి సవిత శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అత్యుత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులకు కుల సంఘాలు బాసటగా నిలవడం అభినందనీయమన్నారు. విద్యలో రాణిస్తున్న పేద విద్యార్థులకు ఈ సత్కారాలు మరింత ప్రోత్సాహమిస్తాయన్నారు. ఏపీలో విద్యా వ్యవస్థను రాష్ట్ర ఐటీ, విద్య శాఖ మంత్రి నారా లోకేశ్ అత్యున్నత స్థానాలకు తీసుకెళుతున్నారన్నారు. గత పాలనలో భ్రష్టుపట్టిన విద్యా వ్యవస్థను ఆయన గాడిన పెడుతున్నారన్నారు. టెన్త్, ఇంటర్ పరీక్షలకు ముందు వందరోజుల ప్రణాళికలు అమలు చేసి, అత్యుత్తమ ఫలితాలు సాధించడంలో ఆయన కృషి మెచ్చుకోదగినదన్నారు. తల్లికి వందనం, విద్యా మిత్ర కిట్లు, సన్నబియ్యంతో భోజనం, నాణ్యమైన విద్య ప్రభుత్వ విద్యా సంస్థల్లో అందుతున్నాయన్నారు. బీసీ గురుకులాలు, బీసీ హాస్టళ్లలో ఆహార, ఆరోగ్య భద్రతతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. కేవలం విద్యతోనే సరిపెట్టకుండా, క్రీడల్లోనూ ప్రోత్సహించేలా బీసీ గురుకులాల్లో స్పోర్ట్స్ కిట్లు అందజేయబోతున్నామన్నారు. కార్పొరేట్ విద్యా సంస్థలకు ధీటుగా ప్రభుత్వ విద్యా సంస్థలను తీర్చిదిద్దుతున్నామన్నారు. విద్యార్థులు లక్ష్యాలు నిర్దేశించుకుని ముందుకు సాగాలన్నారు. తల్లిదండ్రులు, సమాజం గర్వించేలా ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. తల్లిదండ్రులు సైతం పిల్లల మనోభావాలకు గౌరవిమిస్తూ, ఉన్నత విద్య చదివేలా ప్రోత్సహించాలన్నారు.

**104 మంది విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు..** కురమ సంక్షేమ సంఘం ఆధ్వర్యలో కురుబ, కురుమ, కురవ సామాజిక వర్గానికి చెందిన 104 మంది విద్యార్థులకు భక్త కనకదాస పురస్కారాలను మంత్రి సవిత అందజేవారు. రూ.3.30 లక్షల విలువ చేసే నగదు ప్రోత్సాహకాలు మంత్రి చేతుల మీదుగా అందజేశారు. టెన్త్ తో పాటు సెకండ్ ఇంటర్ లో అత్యధిక మార్కులు సాధించిన వారికి ఈ ప్రోత్సాహకాలు అందజేశారు. టెన్త్, సెకండ్ ఇంటర్ లో కురుబ, కురుమ, కురవ సామాజిక వర్గంలో మొదటి అయిదు స్థానాల్లో నిలిచిన ఇద్దరు విద్యార్థులకు రూ.5 వేల చొప్పున రూ.10 వేలు అందజేశారు. ద్వితీయ స్థానంలో నిలిచిన 20 మంది టెన్త్, ఇంటర్ విద్యార్థులకు రూ.3 వేల చొప్పున రూ.30 వేలు అందజేశారు. తృతీయ స్థానంలో నిలిచిన 20 మంది విద్యార్థులకు రూ.2 వేలు చొప్పున రూ.40 వేలు అందజేశారు. మరో 120 మంది విద్యార్థులకు రూ.వెయ్యి చొప్పున రూ.లక్షా 20 వేలు ప్రోత్సాహక నగదు రూపంలో అందజేశారు.

**బ్యాగ్ లు, నగదు అందజేసిన మంత్రి సవిత..** అత్యుమ్మ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సొంతంగా రూ.లక్ష నగదు, 200 స్కూల్ బ్యాగ్ లను మంత్రి సవిత అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో టెన్త్ లో, ఇంటర్ లో అత్యధిక మార్కులు సాధించిన కురుబ, కురుమ, కురవ సామాజిక వర్గానికి చెందిన నలుగురు విద్యార్థులకు రూ.25 వేల చొప్పున రూ.లక్ష లను మంత్రి సవిత తన తండ్రి పేరు మీద ఏర్పాటు చేసిన ఎస్ఆర్ఆర్ ట్రస్ట్ ద్వారా అందజేశారు. 200 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగ్ లు పంపిణీ చేశారు. తన తండ్రి. మాజీ మంత్రి ఎస్.రామచంద్రారెడ్డికి విద్య పట్ల మక్కువ ఎక్కువని మంత్రి సవిత తెలిపారు. తమ ట్రస్ట్ ద్వారా ఎందరో పేద విద్యార్థులకు ఆర్థిక సాయమందిస్తున్నామన్నారు. ఈ ఏడాది టెన్త్ లో ప్రభుత్వ పాఠశాలలో చదివి 550 పైబడి మార్కులు సాధించిన 24 మంది విద్యార్థులకు రూ.25 వేల చొప్పున ఆర్థిక సాయమందించామన్నారు. ఇంటర్ సెకండియర్ లో 950 పైబడి మార్కులు సాధించిన 70 మందికి రూ.50 వేల చొప్పున అందించామన్నారు. బీటెక్ విద్యార్థులకు లాప్ ట్యాప్ లు అందజేస్తున్నామన్నారు. అంతకుముందు విద్యార్థులకు భక్త కనకదాస పురస్కారాలు అందజేయడానికి వచ్చిన మంత్రి సవితకు కురమ సంక్షేమ సంఘ ప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం మంత్రి సవిత స్థానిక విఘ్నేశ్వరుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం ప్రతినిధులు మర్రి వెంకట సత్యనారాయణ, తట్టి అర్జున రావు, ఎం.సత్యనారాయణ, బక్కా రామకృష్ణ, కార్పొరేటర్ ఎస్.శ్రీనివాసరావు, మర్రిపాటి రమేశ్, లంబు నాగేశ్వరరావు, వెంకట్రామయ్య, దన్నే అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## మెగా డిఎస్సీపై వైకాపా దగాకోరు ఆరోపణలు: శాసనమండలి ప్రభుత్వ డా. వేపాడ చిరంజీవిరావు ధ్వజం

- 15,941 ఉపాధ్యాయ పోస్టులను రికార్డు స్థాయిలో 150 రోజుల్లో భర్తీ చేసిన కూటమి ప్రభుత్వం
- ఆన్‌లైన్ బేస్డ్ పరీక్షల్లో లీకేజీ అసంభవం; కనీస కామన్ సెన్స్ లేకుండా ట్వీట్లు చేస్తున్న జగన్
- నిరుద్యోగులు, ఉపాధ్యాయులను వంచించిన జగన్ 'నిరుద్యోగ ద్రోహి'

**విశాఖపట్నం,కలంకౌంటర్ :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ-విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం కేవలం 23 నెలల పాలనలోనే రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నిలిపి, సామాన్యుల ప్రభుత్వంగా ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకుందని శాసన మండలి ప్రభుత్వ విప్ డా. వేపాడ చిరంజీవి రావు అన్నారు. శనివారం విశాఖపట్నంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఐదేళ్ల వైకాపా పాలన చూసి పారిపోయిన దిగ్గజ కంపెనీలు నేడు ఏపీకి క్యూ కడుతున్నాయని, ప్రపంచమంతా గూగుల్ సెర్చ్‌లో ఆంధ్రప్రదేశ్ వైపు చూసేలా గూగుల్ డేటా సెంటర్, ఐటీ దిగ్గజం 'టీసీఎస్' రాకను సుగమం చేశామని తెలిపారు. అనకాపల్లిలో 'ఆర్సెల్లర్ మిట్టల్', రాయలసీమలో 'రాయల్ ఎన్ఫీల్డ్' లాంటి ప్రపంచ స్థాయి ప్రాజెక్టులను, రాజధాని అమరావతి శరవేగ అభివృద్ధితో అన్ని ప్రాంతాలను సమాంతరంగా అభివృద్ధి జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ అభివృద్ధిని చూసి ఓర్వలేక,ఇది ఇలాగే సాగితే తమ పార్టీకి భవిష్యత్తు ఉండదని భావించి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు.

**జగన్ మోహన్ రెడ్డి కుట్రపూరిత ట్వీట్ - నీదే "దగా చరిత్ర"!** 'గొడ్డలి పార్టీ' నాయకుడు జగన్ మోహన్ రెడ్డి, నేడు ట్విట్టర్ (ఎక్స్) వేదికగా మెగా డీఎస్సీని "దగా డీఎస్సీ" అంటూ కుట్రపూరిత ఆరోపణలు చేయడం హాస్యాస్పదమని డా. వేపాడ మండిపడ్డారు. "ఆంధ్రప్రదేశ్ చరిత్రలో జరిగిన 15 డీఎస్సీలలో, 11 డీఎస్సీలను నిర్వహించి, 1.90 లక్షల మందికి పైగా నిరుద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించిన ఘనమైన చరిత్ర కేవలం తెలుగుదేశం పార్టీది, చంద్రబాబు నాయుడు గారిది అన్నారు. జగన్ ఐదేళ్లపాటు నిద్రపోయి,




ఎన్నికల ముందు కంటితుడుపుగా ఇచ్చిన డిఎస్సీ నోటిఫికేషన్ ఆయన అసమర్థత వల్లే కోర్టు స్టేతో ఆగింది తప్ప తాము ఆపలేదన్నారు. వార్షిక జాబ్ క్యాలెండర్‌ను 'సాక్షి' క్యాలెండర్‌కు పరిమితం చేసి, ఐదేళ్లలో ఒక్క కానిస్టేబుల్ పోస్టును కూడా భర్తీ చేయకుండా 20 లక్షల మంది నిరుద్యోగుల జీవితాలతో జగన్ ఆడుకున్నారని అని ధ్వజమెత్తారు.

**తొలి సంతకంతో మెగా డీఎస్సీ - 150 రోజుల్లో కల సాకారం..** చంద్రబాబు నాయుడు గారు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే వేసిన తొలి సంతకం మెగా డీఎస్సీ ఫైలుపైనేనని గుర్తుచేశారు. మంత్రి నారా లోకేష్ పట్టుదలతో కేవలం 150 రోజుల్లోనే 16,347 పోస్టులకు గానూ 15,941 ఉపాధ్యాయ నియామక ప్రక్రియను అత్యంత పారదర్శకంగా పూర్తి చేశామని వివరించారు.

## మహానాడు ఘనవిజయం... సీఎం చంద్రబాబు నాయకత్వానికి చారిత్రక గుర్తింపు

(మొదటిపేజీ తరువాయి)

భాగస్వామ్యం, సాంకేతికత ఆధారిత రాజకీయ కార్యకలాపాల నిర్వహణలో లోకేష్ చూపిస్తున్న చొరవ మహానాడు విజయానికి ప్రధాన కారణాల్లో ఒకటిగా నిలిచిందన్నారు. అలాగే మహానాడు కార్యక్రమాన్ని హైబ్రిడ్ పద్ధతిలో నిర్వహించి దేశంలో సరికొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారని, రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మహానాడును విజయవంతం చేయడంలో అసాధారణ కృషి చేశారని కొనియాడారు. పార్టీ ఆవిర్భావం నుంచి తెలుగుదేశం సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లిన కార్యకర్తలే పార్టీకి నిజమైన బలమని పేర్కొన్నారు. తెలుగు జాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా, అభివృద్ధి రాజకీయాలకు మార్గదర్శిగా నిలిచిన తెలుగుదేశం పార్టీకి ప్రజలు మరోసారి అఖండ మద్దతు ప్రకటించిన వేదికగా ఈ మహానాడు చరిత్రలో నిలిచిపోతుందని మంత్రులు తెలిపారు. "ప్రజల ఆశయాలే మా అజెండా... అభివృద్ధే మా లక్ష్యం" అనే సందేశాన్ని మహానాడు ద్వారా రాష్ట్ర ప్రజలకు అందించగలిగినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, పార్టీ నాయకత్వాన్ని మంత్రులు ప్రత్యేకంగా అభినందించారు.

## ఆరోగ్యం శీర్షిక

# సినీ రంగంపై అపోహలు.. అసలు నిజం ఏమిటి?

## కలల ప్రపంచం



సినిమా ప్రపంచం అంటే చాలామందికి మెరుపులు, చప్పట్లు, పేరు ప్రతిష్ఠలు గుర్తుకొస్తాయి. వెండితెరపై కనిపించే ఆ వెలుగుల వెనుక జీవితం కూడా అంతే అందంగా ఉంటుందని చాలా మంది అనుకుంటారు. కానీ బయటకు కనిపించే ఆ కాంతుల వెనుక ఎన్నో నిరీక్షణలు, నిరాశలు, పోరాటాలు, కన్నీళ్లు దాగి ఉంటాయి.

సినీ రంగం గురించి సమాజంలో ఎన్నో అపోహలు ఉన్నాయి. అయితే వాటిలో ఎంత నిజం ఉంది? ఈ రంగం అసలు స్వరూపం ఏమిటి? ఒకసారి తెలుసుకుందాం.

**ప్రతిభ కంటే పరిచయాలకే విలువ ఎక్కువ" --- ఇదే పెద్ద అపోహ..**

సినీ కుటుంబాల నుంచి వచ్చిన వారికి అవకాశాలు త్వరగా దక్కుతాయనేది నిజమే. పరిచయాలు ఉంటే తొలి అడుగు వేయడం కొంత సులభమవుతుంది. కానీ ఆ అడుగును నిలబెట్టేది మాత్రం వారి ప్రతిభే.

ప్రేక్షకుల మనసు గెలవకపోతే ఎంతటి పెద్ద కుటుంబం నుంచి వచ్చినా ఎక్కువకాలం నిలవలేరు. అదే సమయంలో ఎలాంటి అండ లేకుండా, కేవలం తమ కష్టాన్ని నమ్ముకొని వచ్చిన వారు కూడా ఈ రంగంలో గొప్ప స్థాయికి చేరుకున్నారు. ప్రతిభను పదును పెట్టుకుంటూ, ఓర్పుతో ముందుకు సాగిన వారినే ఈ రంగం ఆదరిస్తుంది.

**సినీ రంగంలో నీతి నిలబెట్టుకోవడం కష్టం" --- ఇది పూర్తిగా నిజం కాదు**

సినిమా రంగంపై చాలామందికి ఉండే మరో భయం ఇదే. అయితే ప్రతి చోట మంచి, చెడు మనుషులు ఉన్నట్లే ఈ రంగంలో కూడా ఉంటారు.

ఈ ప్రపంచం అందరి కంటికి కనిపించే రంగం కావడంతో చిన్న విషయం కూడా పెద్దగా వినిపిస్తుంది.

సరిహద్దులు స్పష్టంగా పెట్టుకొని, జాగ్రత్తగా వ్యవహరిస్తూ, సరైన వ్యక్తులతో కలిసి పనిచేస్తే గౌరవంగా ఈ రంగంలో ముందుకు సాగవచ్చు. ఒకరి తప్పును మొత్తం రంగానికి ఆపాదించడం సరైంది కాదు.

**వెలుగులు కనిపిస్తాయి.. కానీ వెనుకున్న చీకట్లు కనిపించవు**

సినిమా వాళ్ల జీవితం అంతా సుఖసంతోషాలతో నిండిపోయి ఉంటుందని చాలా మంది భావిస్తారు. కానీ నిజానికి ఈ రంగంలో ప్రతి రోజు ఒక పరీక్షలా ఉంటుంది.

ఒక సినిమా విజయం సాధిస్తే ఆకాశానికెత్తే ప్రపంచం, అదే విఫలమైతే వెంటనే మర్చిపోతుంది.

ఎప్పుడూ పని ఉంటుందనే నమ్మకం ఉండదు. పేరు వచ్చిన తర్వాత కూడా ఒత్తిడి తగ్గదు. తమ స్థానాన్ని నిలబెట్టుకోవడానికి నిరంతరం శ్రమించాల్సిందే.

ఒక్క అవకాశం వస్తే జీవితం మారిపోతుంది" అనుకోవడం పొరపాటు

చాలామంది ఒక అవకాశానికోసం సంవత్సరాల పాటు ఎదురు చూస్తారు. కానీ నిజానికి అవకాశం రావడం ప్రయాణానికి ఆరంభం మాత్రమే.

ఆ అవకాశాన్ని నిలబెట్టుకోవడం, ప్రతి పనితో తనను తాను నిరూపించుకోవడం మరింత కష్టం. ఈ రంగంలో ప్రతి సినిమా, ప్రతి పాత్ర, ప్రతి రోజు కొత్త పరీక్షే. నిలకడగా కష్టపడేవారికే ఇక్కడ స్థానం ఉంటుంది.

**అసలు సినీ రంగం నిజస్వరూపం ఏమిటి?**

సినీ రంగం ఒక కలల ప్రపంచం. భావోద్వేగాలను పంచే అద్భుతమైన కళారంగం. కానీ అదే సమయంలో మనసును, సహనాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పరీక్షించే ప్రయాణం కూడా.

ఇక్కడ ఎక్కువకాలం నిలిచే వారు:

ఓటమిని వ్యక్తిగత అవమానంగా తీసుకోరు.

నేర్చుకోవడం ఆపరు.

క్రమశిక్షణను పాటిస్తారు.

సహనాన్ని కోల్పోరు.

కేవలం మెరుపులను చూసి వచ్చినవారికంటే, సినిమాను హృదయపూర్వకంగా ప్రేమించే వారినే ఈ రంగం చివరకు గెలిపిస్తుంది.

–డాక్టర్ సునీత జువ్వా
సైకాలజిస్ట్,
హైదరాబాద్



## పదోన్నతితో ఉత్తమ పోలీసింగ్ సేవలను అందించాలి - ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు



**ఒంగోలు,కలంకౌంటర్ :** ప్రకాశం జిల్లా పోలీస్ శాఖలో ఎస్.ఐలుగా విధులు నిర్వహిస్తూ సి.ఐలుగా పదోన్నతి పొందిన వారు శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రకాశం జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు ని మర్యాదపూర్వకంగా కలిశారు. ముగ్గురు ఎస్సైలు కె. కమలాకర్ , యం. మురళి (దర్శి పిఎస్), యు. వెంకటకృష్ణయ్య(టాస్క్ ఫోర్స్, ఒంగోలు) పదోన్నతి పొందారు. ఈ సందర్భముగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ సి.ఐలుగా పదోన్నతి పొందడం బాధ్యతను మరింత పెంచుతుందని, సి.ఐ.గా విధి నిర్వహణలో అంకిత భావముతో, నిబద్దత మరియు నిజాయితీతో ప్రజలకు సుధీర్ఘమైన సర్వీస్ చేస్తూ, పోలీస్ శాఖ గౌరవం, ప్రతిష్ట పెరిగే విధంగా ఎటువంటి రిమార్క్స్ లేకుండా బాధ్యతలు నిర్వహిస్తూ ఉన్నతాధికారుల మన్ననలు అందుకోవాలన్నారు. భవిష్యత్ లోనూ ప్రజలకు మెరుగైన ఉత్తమ పోలీసింగ్ సేవలను అందించాలని ఆకాక్షించారు.

# మోపిదేవి మండలంలో దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించిన టీడీపీ నేత కనపర్తి శ్రీనివాసరావు

- చరవాణిలో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి పంట నష్టం తీసుకెళ్లిన కనపర్తి శ్రీనివాసరావు
- పంట నష్టం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నష్టపరిహారం అందేలా చూస్తామని రైతులకు భరోసా ఇచ్చిన కనపర్తి శ్రీనివాసరావు





**మోపిదేవి,కలంకౌంటర్ :** ఇటీవల కురిసిన అకాల గాలివాన ధాటికి మోపిదేవి మండలంలోని రైతులు తీవ్రంగా నష్టపోయారు ఈ నేపథ్యంలో శనివారం మండలంలోని బొబ్బర్లంక, నాగాయతిప్ప, మోపిదేవి లంక,కోసూరువారి పాలెం గ్రామాల్లో దెబ్బతిన్న అరటి, ములగ, బొప్పాయి పంట పొలాలను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ పర్యటనలో భాగంగా నేలకొరిగిన అరటి, ములగ, బొప్పాయి తోటలను కనపర్తి శ్రీనివాసరావు క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్ట తీవ్రతను పరిశీలించారు . అరటి చెట్లు పండ్ల గెలలతో సహా విరిగిపడిపోగా, కోతకు సిద్ధంగా ఉన్న బొప్పాయి కాయలు రాలిపోయి తోటల్లోనే కుళ్ళిపోతున్న దయనీయ స్థితిని చూసి చలించిపోయారు. గంటల తరబడి వీచిన గాలుల వల్ల 7 నెలల పాటు కంటికి రెప్పలా కాపాడుకున్న పంట కేవలం 20 రోజుల్లో చేతికి వస్తుందనగా ఇలా సర్వనాశనం అవ్వడంపై రైతులు శ్రీనివాసరావు ఎదుట ఆవేదన చెందారు . ఎకరాకు లక్షల రూపాయల పెట్టుబడి పెట్టామని, ఇప్పుడు తీవ్ర అప్పులపాలయ్యామని ఆవేదన వ్యక్తం చేశారు.రైతుల కష్టాలను, నష్టాలను ఆలకించిన కనపర్తి శ్రీనివాసరావు వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అకాల వర్షం వల్ల అన్నదాతలు కోలుకోలేని దెబ్బతిన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యానవన శాఖ అధికారులు వెంటనే మండలంలో దెబ్బతిన్న ప్రతి ఎకరాన్ని త్వరితగతిన సర్వే చేయాలని విజ్ఞప్తి చేశారు .ప్రకృతి వైపరీత్యం వల్ల సర్వస్వం కోల్పోయిన మోపిదేవి మండల రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందని,నష్టపోయిన ప్రతి రైతుకూ పరిహారం అందేలా ఈ విషయాన్ని ఉన్నతాధికారులు మరియు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మోపిదేవి మండలం ఉద్యానవన శాఖ అధికారి రమేష్,మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు,కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి రావి రత్నగిరి,పార్టీ నాయకులు పర్చూరి దుర్గాప్రసాద్,దాసినేని శ్రీనివాసరావు,దొప్పలపూడి జగదీష్,ముమ్మనేని బాబూరావు,కోనేరు నాగేశ్వరరావు,చందన రంగారావు,కోనేరు శివలీల,జన్ను వెంకటేశ్వరరావు,బళ్ల ప్రసాద్,కొమ్ము పవన్ కుమార్,పుప్పాల యేసు,గొరిపర్తి సత్యనారాయణ(కటారి),గవిని శివరామకృష్ణ,డోకిపర్తి బాలకోటేశ్వర రావు,యక్కటి హనుమాన్ తదితరులు పాల్గొన్నారు

# జూన్ 7న గచ్చిబౌలి స్టేడియంలో 'ఫిట్ ఇండియా--సండేస్ ఆన్ సైకిల్' కార్యక్రమం





**హైదరాబాద్,కలంకౌంటర్ :** క్రీడలు, ఫిట్‌నెస్ కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యాన్ని మరింత పెంచే లక్ష్యంతో తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్) ఆధ్వర్యంలో జూన్ 7న గచ్చిబౌలి స్టేడియంలో 'ఫిట్ ఇండియా--సండేస్ ఆన్ సైకిల్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ద్వారా ఆరోగ్యకర జీవనశైలిపై ప్రజల్లో అవగాహన కల్పించనున్నారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. శాట్స్ వైస్ చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎ. సోనిబాలా దేవి, ఐఎఫ్ఎస్ శుక్రవారం లోక్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసి కార్యక్రమానికి ఆహ్వానించారు. గవర్నర్ ఆహ్వానాన్ని స్వీకరించి కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. సైక్లింగ్ ర్యాలీ ఏర్పాట్లపై ఎల్‌బీ స్టేడియంలోని శాట్స్ కార్యాలయంలో వివిధ సైక్లింగ్ సంఘాల ప్రతినిధులతో సమీక్ష సమావేశాలు నిర్వహించి ఏర్పాట్లను ఖరారు చేశారు. 'ఫిట్‌నెస్ కి డోస్--ఆధా గంటా రోజ్' నినాదంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు, యువత, ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సాధారణ ప్రజల్లో ఆరోగ్యం, ఫిట్‌నెస్, చురుకైన జీవన విధానంపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. గచ్చిబౌలి స్టేడియం ప్రధాన ద్వారం నుంచి ప్రారంభమయ్యే సైక్లింగ్ ర్యాలీ ఐఐఐటీ జంక్షన్, గచ్చిబౌలి ఫ్లైఓవర్, పిస్తా హౌస్ జంక్షన్, బిట్స్, కేబుల్ బ్రిడ్జి, మాదాపూర్, భారతీయ విద్యాభవన్ సెంటర్ రోడ్, బయోడైవర్సిటీ రోడ్ మీదుగా తిరిగి స్టేడియానికి చేరుకుంటుంది. ఈ కార్యక్రమంలో సుమారు 2,000 మంది సైక్లిస్టులు పాల్గొనే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. పాల్గొనే వారందరికీ తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ తరఫున పతకాలను, సర్టిఫికెట్లు అందజేయనున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సోనిబాలా దేవి మాట్లాడుతూ సైక్లింగ్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేయడంతో పాటు పర్యావరణ హిత రవాణా విధానమని అన్నారు. కాలుష్యాన్ని తగ్గించడంలో, సుస్థిర జీవనశైలిని ప్రోత్సహించడంలో సైక్లింగ్ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు, క్రీడాకారులు, ఉద్యోగులు, వివిధ సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొనడం ద్వారా సామాజిక అనుబంధాలు మరింత బలోపేతం అవుతాయని ఆమె తెలిపారు. కార్యక్రమంలో పాల్గొనదలచిన వారు నమోదు, ఇతర వివరాల కోసం గచ్చిబౌలి స్టేడియం అడ్మినిస్ట్రేటర్ కె. మధును 9000033100 నంబర్‌లో సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.

# తెనాలి కల్చరల్ ఫిలింసొసైటీ ఆధ్వర్యంలో దాసరి 9వర్ధంతి









**తెనాలి,కలంకౌంటర్ :** సినీ నటునిగా, దర్శకునిగా, రచయితగా, నిర్మాతగా, గీత రచయితగా వెయ్యి విద్వత్తుల బలం సాధించిన దర్శక రత్న దాసరి నారాయణరావు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని పలువురు వక్తలు నివాళులర్పించారు. తెనాలి కల్చరల్ ఫిలింసొసైటీ ఆధ్వర్యంలో దాసరి 9వర్ధంతి శనివారం ఘనంగా నిర్వహించారు. సభకు రాష్ట్రవార్తసంపాదకులు కంకిపాటిరమేష్ కుమార్ ఆద్యక్షతవహించి, మాట్లాడుతూ రచయితగా, దర్శకుడు, రాజకీయ నాయకునిగా గిన్నిస్ బుక్ రికార్డ్స్ దాసరి నారాయణరావు పేరు నేటికీ చిరస్థాయిగా మార్మోగుతుందన్నారు. హీరోచుక్కాని, దర్శకులకు కేప్టెన్ అని ఇర్దేశించినవారుదాసరినారరరణరావుఅన్నారు. దర్శకునిగా పరిశ్రమలో తనదైన ముద్ర వేసుకున్నారని దాదాపు 63 సినిమాల్లో రకరకాల పాత్రలో హాస్యాన్ని, సెంటిమెంటును పండించి వినూత్న శైలి కనబరిచారన్నారు. రఘుపతి వెంకయ్య నాయుడు పురస్కారం, ఎన్టీఆర్ జాతీయ పురస్కారం, వందలాది సన్మానాలు సత్కరాలు అందుకున్నారనిఅన్నారు. రాజ్యసభ సభ్యునిగా, కేంద్రమంత్రిగా ప్రజాసేవ చేశారనికొనియాడారు. దాసరి వందలాదిమంది దర్శకులను తయారు చేశారని విశ్వవ్యాప్తంగా ఖ్యాతిని పొందారని దాసరి రూపొందించిన చిత్రాలన్నీ ఆణిముత్యాలు అన్నారు దాసరి శకం తెలుగు సినీ పరిశ్రమకు దిక్సూచి లాంటిది అన్నారు. 250 చిత్రాలకు పైగా మాటలు రచయితగా దర్శకునిగా నటునిగా ఆయన ప్రయాణం అనితర సాధ్యమన్నారు. ఆయన స్ఫూర్తితో నేటితరం ముందుకు సాగాలన్నారు. దాసరి నారాయణరావు బహుముఖప్రజ్ఞాశాలి దాసరిఅనిఆయన కొనియాడారు. తెలుగుసినిమాకుయుగకర్త దాసరి నారాయణ అనికొనియాడారు. ఆంధ్రప్రధేశ్ రాష్ట్ర ఉత్తమనటునిగాఅవార్డుపొందారు. దాసరిశకం తెలుగుసినిమాకు స్వర్ణయుగంఅని చెప్పారు. సాహితివేత్త ప్రొఫెసర్ పాతూరిసుబ్రమణ్యం మాట్లాడుతూ దాసరినారాయణరావు పాటలు విన్నూత్నమైన బావాలతో ఆకట్టుకున్నాయని చెప్పారు. ముందుగా గాయకులు సాహితీవేత్తలు, నటులు పూలమాల వేసిననివాళా ర్పించారు. కార్యక్రమంలో జర్నలిస్ట్ నాయకులు మార్కండేయులు. ఓ,చందుఅనురాధ, చందు సూర్య,బొమ్మురామకృష్టారెడ్డి,వెంకట్,అంబటి కిరణ్ కుమార్,యామిని స్వామి, తదితరులుపాల్గొన్నారు. దాసరిచిత్రాలలోనిపాటలను అనురాధ,యామిని అలపించారు.

# విజేతలకు బహుమతులు



**ఉయ్యూరు,కలంకౌంటర్ :** విజ్ఞాన సమపార్జనకు గ్రంథాలయాలు ఎంతగానో ఉపయోగపడతా యని ఉయ్యూరు మున్సిపల్ మాజీ చైర్మన్ ఖుద్దూస్ అన్నారు. స్థానిక గ్రంథాలయంలో జరుగు తున్న వేసవి శిక్షణ శిబిరానికి శనివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. చిన్ననాటి నుండి గ్రంథాలయాలకు వచ్చి పుస్తకాలు చదవడం అలవరుచుకో వాలన్నారు . సూర్య కుటుంబం వాటియొక్క వాస్తవికతను రిసోర్సుపర్సన్ సీహెచ్ మహాలక్ష్మి వివరించారు. పొడుపు కథలపై ప్రశ్నలు అడిగి జవాబులు చెప్పినవారికి ఎల్ఎసీఏజెం ట్ గుర్రాల మధు బహుమతులు అందచేశారు. జనసేన నాయకుడు బి శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలి



**ఉయ్యూరు,కలంకౌంటర్ :** ప్రభుత్వపాఠశాలల్లో మెరుగైన విద్యాబోధనకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందించి అమలుచేస్తుందని ఏఎంసీ చైర్మన్ కొండా ప్రవీణ్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధి, మెరుగైన సౌకర్యాలు, ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు తెలియచేస్తూ శనివారం ఉపాధ్యాయులతో కలిసి గండిగుంట, ఉయ్యూరులో పర్యటిం చి ఇంటింట ప్రచారం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేశ్ యువత భవిష్యత్తుకు పునాదివేసేలా మెరుగైన విద్యావ్యవస్థ రూపొందించారని, గడచిన పదవతరగతి పరీక్షల ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ కనపరచడం నిదర్శనమన్నారు. తలితండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ఆర్థిక భారాన్ని తగ్గించుకోవాలని విజ్ఞప్తిచేశారు. ఉయ్యూరు జడ్పీ హైస్కూల్ హెచ్ఎం టీవీ నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు సురేఖ, హనుమాయమ్మ, సీఆర్పీ పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

